సాక్షి విజయనగరం

I

శనివారం । 22 । ఏప్రిల్ । 2023

న్యూస్‌రీల్

దాతృత్వానికి ప్రతీక రంజాన్


కోలగట్ల వీరభద్రస్వామి


మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: పవిత్ర ఆరాధనకు, ధార్మిక చింతనకు, దైవభక్తికి, క్రమశిక్షణకు, దాతృత్వానికి ప్రతీక రంజాన్ అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ముస్లిం సోదర, సోదరీమణులకు శుక్రవారం ఒక ప్రకటనలో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆధ్యాత్మిక, సామాజిక, వ్యక్తిగత ధర్మానికి ఆధారం పవిత్ర ఖురాన్‌గా పేర్కొన్నారు. అల్లా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు.

మరొకరికి కోవిడ్ పాజిటివ్

- మూడుకు చేరిన కేసుల సంఖ్య

విజయనగరం ఫోర్ట్: విజయనగరం జిల్లాలో కోవిడ్ కేసుల సంఖ్య మూడుకు చేరింది. గురువారం ఇద్దరికి పాజిటివ్‌గా నిర్ధారణకాగా, శుక్రవారం నిర్వహించిన పరీక్షల్లో మరొకరికి కోవిడ్ నిర్ధారణ అయింది. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉండడంతో కోవిడ్ కిట్ అందించి హోమ్ ఐసోలేషన్ చేసినట్టు సర్వజన ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

రంజాన్ శుభాకాంక్షలు


కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: సామరస్యానికి, సహృద్భావానికి, సర్వ మానవ సమానత్వానికి, కరుణ, దాతృత్వానికి, ధార్మిక చింతనకు ప్రతీక రంజాన్ పర్వదినమని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. జిల్లాలోని ముస్లింలకు శుక్రవారం ఓ ప్రకటనలో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఉపవాసాలు, దీక్షలు, దానధర్మాలు, ధార్మిక చింతనతో సాగే రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదిగా అభివర్ణించారు. పవిత్ర ఖురాన్ వ్యాఖ్యలను సదా స్మరించుకుంటూ.. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో పయనించాలని కోరారు. అదే పవిత్ర రంజాన్ మానవాళికి ఇచ్చే శుభసందేశమని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ విద్య: మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకులాల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ దాసరి సత్యారావు కోరారు. సింహాచలంలోని గురుకులంలో ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సుల్లో ఇంగ్లిష్ మీడియం బోధనలో విద్యనందిస్తున్నామన్నారు. మే 18 వరకు దరఖాస్తుకు గడువు ఉందన్నారు. మే 28న ఎంట్రన్స్ పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఐదు, ప్రథమ ఇంటర్‌లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష రేపు

విజయనగరం ఫూల్‌బాగ్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ ఆధ్వర్యంలో విజయనగరం, పార్వతీపురం – మన్యం జిల్లాలో ఉన్న 13 డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/ కళాశాలల్లో ఐదు, ప్రథమ ఇంటర్‌లో ప్రవేశాలకు ఈ నెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు గురుకులాల జిల్లా సమన్వయకర్త బి. చంద్రావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు జిల్లాల్లో కలిపి ఐదో తరగతికి 2,602, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి 1,868 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఉదయం ఐదో తరగతికి, మధ్యాహ్నం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి ప్రవేశ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్స్ చీఫ్ సూపరింటిండెంట్లు, అబ్జర్వర్లకు అందజేసినట్లు తెలిపారు.

రాయితీపై సూక్ష్మసేద్యం పరికరాలు

వేపాడ: జిల్లాలో 891 హెక్టార్లలో సాగుచేసేందుకు అనువుగా తుంపర, బిందు సేద్యం పరికరాలను రైతులకు రాయితీపై ప్రభుత్వం సమకూర్చిందని ఏపీ మైక్రోఇరిగేషన్ ప్రాజెక్టు పథక సంచాలకులు పి.ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. వావిలపాడులోని రైతులకు మంజూరు చేసిన యూనిట్ పరికరాలు, వినియోగంపై పరిశీలించారు. ఒక్కోయూనిట్ విలువ రూ.23,984 కాగా 55 శాతం రాయితీపై అందజేశామన్నారు.

23న శశిలో ఐఐటీ, నీట్‌పై అవగాహన

తగరపువలస (విశాఖ జిల్లా): 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు సంగివలస శశి విద్యాసంస్థల్లో ఈ నెల 23న ఐఐటీ, నీట్‌పై అవగాహన కలిగిస్తున్నట్టు ఆ విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఐఐటీ జేఈఈ, నీట్ పరీక్షలపై సందేహాలను తీరుస్తామన్నారు. వివరాలకు 97059 25599, 97056 35599 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మరో ముందడుగు


భోగాపురం విమానాశ్రయ స్థలం

నోటిఫైడ్ ఏరియా ఇదే (ఎకరాల్లో)....		
గ్రామ పంచాయతీ	ప్రస్తుత విస్తీర్ణం	నోటిఫైడ్ ఏరియా
సవరవిల్లి	1223.245	11.42
ఎ.రావివలస	915.405	39.21
దల్లిపేట	862.0225	286.52
గూడెపువలస	1715.52	424.61
బైరెడ్డిపాలెం	1297.7675	598.285
కవులవాడ	2149.619	589.285
ఆర్.కంచేరు	889.799	153.255
రావాడ	2064.69	89.34
ముంజేరు	2756.367	11.14
మొత్తం	13874.435	2203.26

- 3న భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు శంకుస్థాపనకు ఏర్పాట్లు
- 2,203.26 ఎకరాలను నోటిఫై చేస్తూ ఉత్తర్వులు
- విమానాశ్రయం నిర్మాణానికి భూసేకరణ పూర్తి
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఉత్తరాంధ్ర దశా దిశా మార్చేసే భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణం దిశగా ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మే 3వ తేదీన శంకుస్థాపన రాయి వేయించేందుకు ఆగమేఘాలపై అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విమానాశ్రయం నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేశారు. ఇందులో భాగంగా భోగాపురం మండలంలోని తొమ్మిది గ్రామ పంచాయతీల పరిధిలోనున్న 2,203.26 ఎకరాల భూమిని ప్రభుత్వం నోటిఫైడ్ ఏరియాగా ప్రకటించింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జె.శ్యామలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గందరగోళం...

విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీజం పడింది. అయితే, 15 వేల ఎకరాలు అవసరమని ప్రచారం చేస్తూ టీడీపీ నాయకులు భోగాపురం మండలంలో గందరగోళాన్ని సృష్టించారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఐదు వేల ఎకరాలతో సరిపెట్టాలని నాటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. తీరా రైతులకు పరిహారం ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున ప్రకటించింది. మళ్లీ దీన్ని వ్యతిరేకిస్తూ 2015 ఆగస్టులో రైతులు ఆందోళనలకు దిగారు. నిబంధనలేవీ పాటించకుండా భూసేకరణకు నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ కొంతమంది హైకోర్టులో పిటిషన్లు వేశారు. అవి పెండింగ్‌లో ఉండగానే 2019 సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధికోసం చంద్రబాబు విమానాశ్రయం నిర్మాణానికి శంకుస్థాపన ఘట్టం మమ అనిపించేశారు. ఏదీ కొలిక్కి రాకుండానే టెంకాయ కొట్టేసిన ఆయన ఘనకార్యాన్నే ఇప్పటికీ టీడీపీ నాయకులు తమ గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారు.


9 గ్రామాల పరిధిలో నోటిఫైడ్ ఏరియా...

భోగాపురం మండలంలోని తొమ్మిది గ్రామ పంచాయతీల పరిధిలో నోటిఫైడ్ ఏరియాను ప్రభుత్వం ప్రకటించింది. సవరవిల్లి, ఎ.రావివలస, దల్లిపేట, గూడెపువలస, బైరెడ్డిపాలెం, కవులవాడ, ఆర్.కంచేరు, రావాడ, ముంజేరు గ్రామాల పరిధిలో మొత్తం 13,874.43 ఎకరాల భూమి ఉంది. దీనిలో 2,203.26 ఎకరాల భూమి నోటిఫైడ్ ఏరియాలో ఉంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే ఘనత

విమానాశ్రయానికి అవసరమైన అనుమతులు సాధించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ స్థాయిలో విశ్వ ప్రయత్నాలు చేశారు. మరోవైపు క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకున్నారు. భూమి పరిస్థితిని బట్టి ఎకరాకు రూ.28 లక్షల నుంచి రూ.36 లక్షల వరకూ పరిహారం ప్రకటించారు. అంతకుముందు డి.పట్టా భూములకు టీడీపీ ప్రభుత్వం ప్రకటించిన పరిహారం రూ.12.50 లక్షలు మాత్రమే. అలా కాకుండా వారికీ జిరాయితీ భూమితో సమానంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, భోగాపురం మండల నాయకుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి తదితరులు రైతులతో చర్చించడంతో రైతులు చాలామంది హైకోర్టులో పిటిషన్లను ఉపసంహరించుకున్నారు. మిగతావాటినీ ఇటీవల హైకోర్టు పరిష్కరించింది. విమానాశ్రయ నిర్మాణానికి 2,203.26 ఎకరాల భూమి సరిపోతుందని ప్రభుత్వం నిర్ణయించింది.

రంజాన్‌కు సర్వం సిద్ధం



- విద్యుత్ దీపాల అలంకరణలో మసీదులు
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు
- ఉదయం 8 గంటల నుంచే నమాజ్
- నేడు రంజాన్ పర్వదినం

విజయనగరంటౌన్: వరాల వసంతం, సుఖాల సరోవరమైన రంజాన్ మాసం శుక్రవారం చంద్రదర్శనంతో ముగిసింది. ఈదుల్ ఫితర్‌ను శనివారం నిర్వహించాలని ముస్లిం పెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు ముస్లింలందరూ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, అత్యంత భక్తిభావంతో మెలిగిన ప్రతి ముస్లిం సోదరుడు పవిత్రమైన రంజాన్ పండగ కోసం వేచిచూస్తాడు. నిరుపేదలకు దానధర్మాలు చేస్తారు. అల్లా శాంతి సందేశాన్ని వినిపిస్తారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఆనందపరవశులవుతారు. భారతదేశ సౌభ్రాతృత్వానికి ప్రతీకగా అంతా మంచి జరగాలని నమాజ్ చేస్తారు. నెలరోజుల పాటు చేసే ఉపవాస దీక్షలు, దానధర్మాలే తమకు మంచి చేస్తాయని విశ్వసిస్తారు. రంజాన్ రోజు ప్రత్యేక ప్రార్థనలకు జిల్లాలోని అన్ని మసీదులు, ఈద్‌గాలను విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబుచేశారు. చిన్నా, పెద్దా తేడాలేకుండా ముస్లిం సోదరులందరూ రంజాన్ వేడుకలకు సిద్ధమవుతున్నారు.

ఉదయం 8 గంటల నుంచే...



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఈద్‌గాలో ఉదయం 8 గంటలకు, జామియా మసీదులో 8.30 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తాం. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసం ఉన్న వారందరూ మంచి వాతావరణంలో పండగ నిర్వహించుకోవాలి. భారతదేశ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అల్లాకు నమాజ్ చేస్తాం.

– షేక్‌రహీమ్, అధ్యక్షుడు, జామియా మసీద్ మేనేజింగ్ కమిటీ, విజయనగరం

సంబరంగా రంజాన్



ముస్లింసోదరులు పవిత్ర రంజాన్ మాసంలో ఖురాన్‌లోని సందేశాన్ని విన్నారు. మానవులంతా సమానమే. ఈదుల్ ఫితర్‌ను పురస్కరించుకుని ప్రతిఒక్కరూ దానధర్మాలు చేయాలని పండగ సూచిస్తుంది. అల్లాను స్మరిస్తూ అందరి బాగోగుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయాలి. ప్రతి ముస్లిం సోదరుడు ఆనందంతో నిర్వహించుకునే పండగ రంజాన్.

– మహమ్మద్ హబీబ్, జమాతే ఇస్లామీ హింద్ సంస్థ పట్టణఅధ్యక్షుడు, విజయనగరం

శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక



పవిత్ర రంజాన్ మాసం పూర్తయిన సందర్భంగా ముస్లిం సోదరులందరికీ శుభాకాంక్షలు. భారతదేశ అభివృద్ధి, శాంతి, సౌభ్రాతత్వానికి ప్రతీకలుగా సోదరులందరూ విశిష్ట ప్రార్థనలు చేయాలి. దివ్య ఖురాన్ గ్రంథంలోని అంశాలను పాటిస్తూ సర్వమానవాళి శ్రేయస్సుకు కృషిచేయాలి.

– అబ్దుల్ కరీమ్, జిల్లా వక్ఫ్‌బోర్డు కమిటీ మాజీ అధ్యక్షుడు, విజయనగరం

నిర్వాసితులను పలకరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..

- భోగాపురం విమానాశ్రయ నిర్వాసిత కాలనీల్లో పర్యటించిన కలెక్టర్


పోలిపల్లి నిర్వాసిత కాలనీలో పర్యటిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్

భోగాపురం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్వాసితులకు గూడెపువలస, పోలిపల్లి రెవిన్యూ పరిధిలోని లింగాలవలస గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్అండ్ఆర్ కాలనీలను కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం సందర్శించారు. నిర్వాసితులు, స్థానిక పెద్దలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పోలిపల్లి నిర్వాసిత కాలనీని పంచాయతీగా ఏర్పాటు చేయాలని, పోలిపల్లి కూడలిని అభివృద్ధి చేసి ఆర్చ్‌ను ఏర్పాటు చేయాలని, అప్రోచ్ రోడ్డుకు కాలనీ రోడ్లను అనుసంధానించాలని గ్రామ పెద్దలు కోరారు. పంచాయతీగా ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కాలనీల యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ చెప్పారు. గూడెపువలస నిర్వాసిత కాలనీలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల భవనాలను పరిశీలించారు. త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ మయూర్‌అశోక్, డీపీఓ శ్రీధర్‌రాజా, ట్రాన్స్‌కో ఎస్ఈ నాగేశ్వరరావు, పీఆర్ఎస్ఈ గుప్త, ఆర్అండ్ఆర్ ఎస్ఈ జయశ్రీ, ఈఈ రమణ, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు రాజాంలో టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి పర్యటన

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామంలో శనివారం ఉదయం 10 గంటలకు జరగనున్న మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్‌లు హాజరుకానున్నారని ఎంపీపీ లావేటి త్రిలోచన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మైనర్‌పై లైంగిక దాడి కేసులో..

నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

- రూ.16వేల జరిమానా
- బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి ఆదేశం
- పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి షేక్ సికింద్ర భాషా

విజయనగరం లీగల్: బాలికను లోబర్చుకొని లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణ రుజువుకావడంతో గంట్యాడ మండలం కొర్లాం గ్రామానికి చెందిన కారు చిన్నారావుకు 20 ఏళ్లు కఠిన కారాగార శిక్ష, రూ.16వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి షేక్ సికింద్ర భాషా శుక్రవారం సంచలన తీర్పు వెల్లడించారు. ఈ కేసులో బాధితరాలికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించారు. అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయసేవా సంస్థకు సూచించారు. ఈ కేసుకు సంబంధించి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మామూరి శంకరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు చిన్నారావు ఎస్.కోట ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఇంటి దగ్గర విద్యార్థులకు ట్యూషన్లు చెబుతూ జీవనం సాగిస్తున్నాడు. 2021 సెప్టెంబర్ 21న తన వద్దకు ట్యూషన్‌కు వచ్చిన బాలికను లోబర్చుకొని పలుమార్లు లైగింక దాడికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ టి.త్రినాథ్ పోక్సో చట్టం, ఇండియన్ పీనల్ కోడ్ చట్టం ప్రకారం చిన్నారావుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రాసిక్యూషన్ సరైన సాక్ష్యాధారాలతో కేసు రుజువు చేయడంతో ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. లైంగిక దాడి కేసులో నిందితుడికి శిక్షపడేలా త్వరితగతిన దర్యాప్తు చేపట్టిన డీఎస్పీ త్రినాథ్, ఎస్ఐ కె.టి.ఆర్.లక్ష్మిని ఎస్పీ దీపిక ప్రశంసించారు. కోర్టులో ప్రాసిక్యూషన్ నిర్వహించిన స్పెషల్ పీపీ శంకరరావును ఆమె అభినందించారు.

సైబర్ నేరాలపై నిఘా

- మాసాంతర నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ ఎం.దీపిక


నేరసమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా వేయాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. సైబర్ నేరం తీరును బాధితుల నుంచి తెలుసుకుని, వెంటనే బ్యాంకు అధికారులతో మాట్లాడి ఖాతాల నుంచి ఆర్థిక లావాదేవీలు జరగకుండా నిలుపుదల చేయాలన్నారు. నిందితుల ఫోన్ నంబర్లు సేకరించి, వారి చిరునామాలు, కాల్స్‌తో కేసులను చేధించాలని సూచించారు. గంజాయి రవాణాపై నిఘా పెంచాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వచ్చి, లాడ్జిల్లో బసచేసిన వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత లాడ్జి యజమానులు తప్పనిసరిగా ఆయా పోలీసు స్టేషన్‌లకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో దర్యాప్తును త్వరితగతిన పూర్తిచేయాలని, నాన్ బెయిలబుల్ వారెంట్లను తక్షణమే ఎగ్జిక్యూట్ చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన కొత్తవలస సీఐ ఎస్.బాల సూర్యారావును బెస్ట్ పెర్ఫార్మర్‌గా ఎంపిక చేసి ప్రశంసాపత్రం అందజేశారు. సమావేశంలో సెబ్ అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, విజయనగరం ఇన్‌చార్జి డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ బి.మోహనరావు, దిశ మహిళా డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, న్యాయ సలహాదారులు వై.పరశురాం, డీపీఓ ఏఓ వెంకటరమణ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన పోలీసులకు ప్రశంసలు

జిల్లా పోలీస్ శాఖలో సమర్థవంతంగా విధులు నిర్వహించి, దొంగతనం కేసులను చేధించిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ ఎం.దీపిక అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. రాజాం సీఐ కె.రవికుమార్, సీసీఎస్ ఎస్ఐ బి.సాగర్‌బాబు, నెల్లిమర్ల ఎస్ఐ పి.నారాయణరావు, రామభద్రపురం ఎస్ఐ బి.సురేంద్రనాయుడు, వన్‌టౌన్ ఎస్ఐ బి.మురళి, కొత్తవలస ఎస్ఐలు వై.వి.జనార్దనరావు, సీహెచ్.హేమంత్‌కుమార్, దిశ మహిళా ఎస్ఐ ఎస్.పద్మావతి, గరివిడి ఏఎస్ఐ సీహెచ్.హరి, ఎమ్.వి.రమణ, బొండపల్లి ఏఎస్ఐ ఎస్.లక్ష్మణరావు, రాజాం హెచ్‌సీ ఎస్.సుగుణాకరరావు, సీసీఎస్‌హెచ్‌సీ డి.శంకరరావు, టూటౌన్ హెచ్‌సీ టీవీఆర్‌కే ప్రసాద్, రాజాం పీసీలు పి.శ్రీరాములు, పి.శ్రీనివాసరావు, నెల్లిమర్ల పీసీ ఎ.రమేష్, వన్‌టౌన్ పీసీలు సాయిరెడ్డి, దుర్గాప్రసాద్, ట్రాఫిక్ పీసీ ఎస్.సింహాచలం, ఆర్.గణపతి, గరివిడి పీసీ ఆర్.కృష్ణమూర్తి, ఎం.మహేశ్వరరావు, బొబ్బిలి పీసీ ఎస్.సత్యనారాయణ, బొండపల్లి పీసీ పి.జీవన్‌కుమార్, ఆంధ్ర పీసీ కె.అప్పన్న, సీసీఎస్ పీసీ జి.గౌరీశంకరరావు, రాజాం హోంగార్డు కె.రాజేంద్ర ప్రశంసాపత్రాలు అందుకున్నారు.


హాజరైన జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది

మనమంతా ప్రజా సేవకులం

- ఉద్యోగులందరూ తమ విధులను రాజ్యాంగబద్ధంగా నిర్వహించాలి
- కలెక్టరేట్‌లో ఘనంగా జాతీయ పౌరసేవల దినోత్సవం
- ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించిన కలెక్టర్, డీఆర్వో


ప్రతిభ చూపిన సచివాలయ సిబ్బందికి జ్ఞాపికలు అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి


ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా అధికారులు

విజయనగరం అర్బన్: మనమంతా ప్రజలకు సేవకులం.. ప్రతిఉద్యోగి రాజ్యాంగ బద్ధంగా విధులు నిర్వహించాలి.. శాఖల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలి.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ నాగలక్ష్మి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో 16వ జాతీయ పౌరసేవలు దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు గుర్తింపు కోసం పని చేయకూడదని, మంచి పనిచేస్తే గుర్తింపు దానంతటదే వస్తుందన్నారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించగలమన్న నమ్మకాన్ని సాకారం చేసేందుకు ఎన్నో ఒత్తిడిలు, ప్రలోభాలను అధిగమించాల్సి ఉంటుందన్నారు. అధికారుల సమన్వయంతోనే ఒత్తిడి అధిగమించడం సాధ్యమవుతుందన్నారు. ఉద్యోగులందరికీ పౌర సేవల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. జేసీ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ దేశ పరిపాలన వ్యవస్థలో ప్రభుత్వ ఉద్యోగులు వెన్నెముక వంటివారని సర్దార్ వల్లభాయ్ పటేల్ పేర్కొన్నట్టు గుర్తుచేశారు. దేశ అభివృద్ధిలో ఉద్యోగుల పనితీరు కీలకమన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారందరికీ ఈ సందర్భంగా శిరస్సు వంచి నివాళులర్పిస్తున్నామన్నారు.

ఉద్యోగులందరూ విలువలతో పనిచేస్తే ప్రజల విశ్వాసాన్ని పొందగలరని తెలిపారు. తొలుత సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ఉత్తమ సేవలందించిన సచివాలయ సిబ్బందిని సత్కరించారు. ఉద్యోగులతో పౌరసేవా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.గణపతిరావు, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్, డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి, మెప్మా పీడీ సుధాకర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మే 10 నాటికి సర్వేరాళ్లు పాతడం పూర్తిచేయాలి

విజయనగరం అర్బన్: రెవెన్యూ, సర్వే సిబ్బంది, అధికారులు సమన్వయంతో పనిచేసి, రీ సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఆర్డీఓలు, మండల తహసీల్దార్లు, డీటీలు, సర్వేయర్లతో శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూముల రీ సర్వే, సరిహద్దురాళ్ల పాతడంపై మండలాల వారీగా సమీక్షించారు. అవసరమైన కూలీలను నియమించి రాళ్లు పాతించాలని సూచించారు. జిల్లాకు మరో 10 రోవర్లు వస్తున్నాయని చెప్పారు. మే 10 నాటికి అన్ని గ్రామాల్లో రాళ్లు పాతడం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే సర్వే పూర్తి చేసిన 179 గ్రామాల్లో మరో సారి క్రాస్‌చెక్ చేయాలని సూచించారు. కార్యక్రమం జేసీ మయూర్ అశోక్, సర్వే ఏడీ త్రివిక్రమరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం సభాస్థలి పరిశీలన



ముఖ్యమంత్రి సభా స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్

భోగాపురం: భోగాపురంలో నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చేనెల మే 3వ తేదీన శంకుస్థాపన చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్న నేపథ్యంలో నిర్వహించే బహిరంగ సభ ప్రాంతాన్ని కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో చర్చించారు. బహిరంగ సభకు వచ్చే ప్రజలు, వీఐపీలు, అతిథులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో ఆమె వెంట జిల్లా పంచాయతీరాజ్ అధికారి శ్రీధర్‌రాజా, ట్రాన్స్‌కో ఎస్‌ఈ గుప్త, పీర్‌ఎస్‌ఈ నాగేశ్వరరావు, పంచాయతీ రాజ్ డీఈ బంగారునాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వైకుంఠరావు, ఎంఆర్వో శ్రీనివాసరావు, ఎంపీడీఓ బంగారయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సిబ్బంది

పార్వతీపురంటౌన్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో యోకోమ జాబ్ డ్రైవ్ శుక్రవారం నిర్వహించారు. ఈ జాబ్ డ్రైవ్‌కు యోకోమ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ జాబ్ డ్రైవ్‌లో 65 మంది ఇంటరూశ్వ్క హాజరుకాగా వారిలో 16 మంది యోకోమ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాబివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.రాజు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం కళాశాలలో నిర్వహించడం ఇదే మొదటి సారి అని, ఇలాంటి కార్యక్రమాలు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో మరిన్ని నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఇలాంటి అవకాశాలని నిరుద్యోగ యువత అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ముగిసిన 'ఫండమెంటల్ గ్లాసర్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్' సదస్సు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వివిధ యూనివర్సిటీ, కళాశాలల బోధన సిబ్బంది

విజయనగరం అర్బన్: కేంద్రియ గిరిజన యూనివర్సిటీలో 'ఫండమెంటల్ గ్లాసర్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్(ఇంగ్లిష్–హిందీ–తెలుగు)' పేరుతో జాతీయ విద్యామంత్రిత్వ శాఖ సారథ్యంలోని కమిషన్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ (సీఎస్‌టీటీ) సహకారంతో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. ఈ వర్క్‌షాప్‌లో 2,855 ఇంగ్లీష్–హిందీ పదాలకు తెలుగులో అర్థాలను రూపొందించారు. ఈ పదాల రూపకల్పనలో పలు కేంద్రియ విశ్వవిద్యాలయాలు నిపుణుల సహకారం తీసుకున్నారు. కార్యక్రమంలో సీఎస్‌టీటీ తరఫున జైసింగ్ రావత్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో వర్క్‌షాప్ నిర్వహించుకునేందుకు అనుమతి ఇచ్చినందుకు వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ బొంతు కోటయ్య సమన్వయకర్తగా వ్యవహరించగా, స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా, స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ శరత్ చంద్ర బాబు, పరిపాలన అధికారి డాక్టర్ ఎన్‌వీసూర్యనారాయణ, యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కమిటీలో నిపుణులందరికీ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 375.00
విజయనగరం	రూ. 379.00
శ్రీకాకుళం	రూ. 379.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	60,930–00
బంగారం(22క్యా. 10గ్రా.)	55,850–00
వెండి (కిలో)	81,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹122	₹214	₹ 224

బాల్యవివాహాలు ప్రోత్సహిస్తే కేసులు

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్



మాట్లాడుతున్న ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ



సమావేశంలో మాట్లాడుతున్న బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

గజపతినగరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా బాల్యవివాహాలు జరిపించిన, ప్రోత్సహించిన వారిపై పోలీస్ శాఖ కేసులు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు కోరారు. ఈ మేరకు శుక్రవారం గజపతినగరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాల్యవివాహాల నివారణ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. గ్రామ, జిల్లా స్థాయి బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని అధికారులు మరింత కఠినంగా అమలు చేయడం కోసం చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామ, వార్డు, వలంటీర్‌లు, సచివాలయాల సిబ్బంది బాల్యవివాహాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తూ గ్రామాల్లో సఖి గ్రూపుల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల వల్ల బాలల భవిష్యత్తు అంధకారంలో కూరుకుపోతుందని, ఆరోగ్యపరంగా, విద్యాపరంగా, మానసికంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో బాల్యవివాహాలపై ఉక్కుపాదం మోపాలని అధికారులు, అనధికారులు, ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా సంఘాలు బాలలతో పనిచేసే సంస్థలు, సంఘాల అందరి భాగస్వామ్యంతో (కలిసికట్టుగా) బాల్యవివాహాల రహిత సమాజంగా నిర్మించి రాష్ట్రాన్ని బాలల స్నేహపూర్వక రాష్ట్రంగా తిర్చిదిద్దడానికి కృషి చేయాలని అప్పారావు పిలుపునిచ్చారు. ఇంకా బాల్యవివాహాలు జరుపుతున్న తల్లి దండ్రులు, జరిపిస్తున్న పురోహితులు, కుటుంబ సభ్యులపై పోలీస్ కేసులు నమోదు చేయాలని అధికారులకు కమిషన్ ద్వారా ఆదేశాలు జారీ చేస్తున్నట్లు చెప్పారు.

తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పిల్లల నడవడిక, ప్రవర్తన, పట్ల తల్లి దండ్రులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ అన్నారు.పిల్లలకు అన్నివిషయాల్లో పూర్తి స్వేచ్ఛను ఇచ్చి వారికి కావాల్సినవి ఇవ్వడం మంచిదే గాని హద్దులు దాటి చేయడం మంచిది కాదని ప్రస్తుతం తల్లిదండ్రుల వల్లే పిల్లలు పూర్తిగా పాడవుతున్నట్లు సర్వే రిపోర్ట్‌లు చెబుతున్నాయన్నారు. పిల్లలు పట్ల తల్లి దండ్రులు ఏమరు పాటు పడకుండా పిల్లల భవిష్యత్తు విషయంలో శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక,స్థానిక తహసీల్దార్ అరుణకుమారి, సీడీపీఓ పి.నాగమణి, ఎంపీడీఓ పప్పు సుదర్శనం, ఎంఈఓ విమలమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.ఆది నారాయణ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఎస్.పైడిరాజు, బి.త్రినాథరావు, పలువురు సర్పంచ్‌లు, విద్యావేత్తలు, వైద్యులు, మహిళా పోలీసులు, అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థి దుర్మరణం

- ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొనడంతో ప్రమాదం



ప్రమాదంలో మరణించిన గురాన పవన్



మృతదేహం వద్ద విషణ్ణ వదనంలో తండ్రి రాము



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేష్

డెంకాడ: మండలంలోని నాతవలస వద్ద విశాఖ–శ్రీకాకుళం జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక విద్యార్థి మృతి చెందగా, మరో ఇద్దరి విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై డెంకాడ ఎస్సై మహేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పూసపాటిరేగ మండల కేంద్రానికి చెందిన గురాన పవన్(21), పతివాడ రామకృష్ణ, లెంక నారాయణరాజు మోటార్‌సైకిల్‌పై డెంకాడ మండలంలోని జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో నాతవలస వద్ద జాతీయ రహదారిపై రాంగ్ పార్కింగ్‌లో ఆగి ఉన్న లారీని వారి మోటార్ సైకిల్ ఢీకొంది. దీంతో విద్యార్థి గురాన పవన్ అక్కడికక్కడే మరణించగా, మరో ఇద్దరి విద్యార్థులు పతివాడ రామకృష్ణ, లెంక నారాయణరాజులు గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం విజయనగరం తరలించారు. విద్యార్థులందరూ పూసపాటిరేగకు చెందిన వారే. డెంకాడ ఎస్సై మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గురైన ముగ్గురు విద్యార్థులు జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. శుక్రవారం ఉదయం కళాశాలకు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వీరు ప్రమాదానికి గురయ్యారు. దీంతో కళాశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అందొస్తాడనుకున్న కొడుకు అర్ధాంతరంగా..

కుమారుడు పవన్ ఇంజినీరింగ్ పూర్తి చేసి తమకు అందివస్తాడనుకుని, ఆశగా ఉన్న తల్లిదండ్రులకు తీవ్ర విషాదం మిగిలింది. అందివస్తాడనుకున్న కొడుకు శాశ్వతంగా అందకుండా పోవడంతో కుమారుడు పవన్ మృతదేహం వద్ద కుటుంబసభ్యులు భోరున విలపించారు.

కారు ఢీకొని మహిళ..

పాచిపెంట: మండలంలోని పాంచాలి గ్రామంలో శుక్రవారం కారు ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటనపై ఎస్సై వెంకటరమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాంచాలి నుంచి సాలూరు వెళ్తున్న ఓ కారు గ్రామ శివారులో మహిసర్ల ధమయంతి(57)ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ధమయంతిని స్థానికులు సమీపంలోని గురువునాయుడుపేట పీహెచ్‌సీకి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందింది. మృతురాలి చెల్లి సరస్వతి ఫిర్యాదుమేరకు ఎస్సై కేసునమోదు చేశారు.

ప్రాజెక్ట్ పనుల్లో పురోగతి సాధించాలి

- రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ నాగలక్ష్మి సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: జిల్లాలో తలపెట్టిన సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని రకాల ప్రక్రియలను త్వరితగతిన ముగించాలని పెండింగ్ పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తోటపల్లి, తారకరామ తీర్థసాగర్, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వెంగళరాయ సాగర్ తదితర ప్రాజెక్టుల భూసేకరణ, పరిహారం చెల్లింపు తదితర అంశాలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి సాగునీటి ప్రాజెక్టులను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని ఆ దిశగా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. ఆయా ప్రాజెక్టుల పరిధిలో ఇప్పటి వరకు జరిగిన పనులు, మిగిలిన పనులకు సంబంధించి ప్రత్యేక నివేదికలు తయారు చేయాలని పేర్కొన్నారు. తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు, తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో ఉన్న సాంకేతిక సమస్యలను అధిగమించి మరిన్ని ఫలితాలు సాధించాలని నిర్దేశించారు. ప్రభావిత ప్రాంతాల్లో అర్హత మేరకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తించే విషయమై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి బిల్లుల చెల్లింపు ప్రక్రియలో తలెత్తిన సాంకేతిక సమస్యలను సంబంధిత అధికారులు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, ప్రత్యేక ఉప కలెక్టర్లు వెంకటేశ్వరరావు, సుదర్శన దొర, పద్మలత, ఇరిగేషన్ ఎస్‌ఈ సుగుణాకర్ రావు, తోటపల్లి ఈఈ రెడ్డి రామచంద్రరావు, వివిధ మండలాల తహసీల్దార్లు, ఇంజినీరింగ్ విభాగ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయం



రామతీర్థంలో గ్రామ సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ తదితరులు

- రానున్న ఎన్నికల్లో పార్టీని ఎవరూ ఆపలేరు
- జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- వల్లూరు, రామతీర్థాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

నెల్లిమర్ల రూరల్: దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని ఆపడం ఎవరి తరమూ కాదని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రామతీర్థం, సతివాడ గ్రామాల్లో నూతన గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలతో పాటు ఏటీ అగ్రహారంలో తారు రోడ్డును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రజల కష్టాలను దగ్గరగా చూసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం కోసం ఎన్నో హామీలు ఇచ్చారని, సీఎం అయిన వెంటనే తు.చ తప్పకుండా నెరవేర్చారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పార్టీలకు అతీతంగా పారదర్శక పాలన ప్రజలకు అందుతోందని చెప్పారు. పార్టీల తారతమ్యం లేకుండా పథకాలు అర్హులకు అందిస్తూ అన్ని వర్గాల ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని..రానున్న ఎన్నికల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాలో అన్ని స్థానాలు మళ్లీ కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

ప్రజలకు అందుబాటులో ఉంటాం

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని ఆ దిశగా ప్రజలకు సుపరిపాలన అందుతుందని స్పష్టం చేశారు. ఎవరికీ భయపడాల్సిన అవసరమే లేదని ప్రజలకు ఏ కష్టం వచ్చినా నిత్యం అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు.



వల్లూరులో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అధికారంలోకి వచ్చిన వెంటనే మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశామన్నారు. నాడు టీడీపీ పాలనలో గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదని స్వప్రయోజనాల కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా పథకాలన్నీ గడప వద్దకే అందిస్తూ గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాశినాయుడు, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, సర్పంచ్ కంచరాపు సూర్యకళ, ఎంపీటీసీ సభ్యురాలు తర్లాడ జయమ్మ, ఎంపీడీఓ గిరిబాల, తహసీల్దార్ రమణరాజు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా అందజేసిన ఎమ్మెల్యే



రంజాన్ తోఫా అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: రంజాన్ పండగ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ తోఫాను ఎమ్మెల్యే జోగారావు అందజేశారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలో శుక్రవారం ముస్లిం సోదరసోదరీ మణులందరితో కలిసి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్య ఖురాన్' గ్రంథం ఈ మాసంలో అవిర్భవించడంతో రంజాన్ మాసంగా పేరు వచ్చిందని క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే 'రంజాన్' మాసం అన్నారు. పవిత్ర మాసంలో ఎంత పవిత్రంగా ఉపవాసం ఉంటూ దీక్షతో చేసిన పండగలు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ వారి దాతృత్వ హృదయాన్ని చాటుకుని కలిగిన వారు లేనివారికి సహాయం చేయాలని సూచించారు. ఈ రంజాన్ మాసంలో ప్రతి ఏడాది ముస్లిం మహిళలందరికీ సొంత నిధులతో తోఫా ప్రదానం చేయడం ఆనవాయితీగా వస్తున్న క్రమంలో ఈ ఏడాది కూడా నియోజకవర్గ పరిధిలో గల ముస్లిం మహిళలందరికీ ఎమ్మెల్యే సొంత నిధులతో చీర, పండక్కి కావల్సిన సామగ్రి కొనుక్కునేందుకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ముస్లిం మతపెద్దలు సఫీ, జలాల్, కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ గౌసియా బేగం, ఏఎంసీ షేక్ షకీనా జానీ, కో ఆప్షన్ ఎంపీటీసీ షేక్ జానీ, మతపెద్దలు, ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తుల విలువ పెంచాలి

- ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పార్వతీపురం: అటవీ ఫలసాయాల విలువను పెంచాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ అన్నారు. ఈమేరకు వెలుగుల క్యాలు, ప్రగతిపై ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో శుక్రవారం సంబంధిత అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యాలు సాధించాలని స్పష్టం చేశారు. ఐటీడీఏ పరిధిలోగల 54 వన్‌ధన్ వికాస్ కేంద్రాలు పూర్తి స్థాయిలో పనిచేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చింతపండు, కొండచీపుళ్లు, జీడిమామిడి, పసుపు, ఇతర అటవీ ఉత్పత్తుల సేకరణకు వాటికి విలువ పెంచి మార్కెటింగ్ చేయాలని ఆయన కోరారు. మార్కెటింగ్‌పై దృష్టి సారించాలని ఆదేశించారు. గిరిజనులకు మంచి ధర రావాలని, వారి ఆర్థిక పరిపుష్టి పెరగాలని ఆకాంక్షించారు. స్త్రీ నిధి, బ్యాంకు అనుసంధాన కార్యక్రమాల ప్రగతి శతశాతం జరగాలని ఆదేశించారు. సమావేశంలో టీపీఎంయూ ఏపీడీ వై. సత్యంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన కుటుంబాలను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

- పార్టీ తీర్థం పుచుకున్న 25 కుటుంబాలు
- ఆహ్వానించిన ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ప్రజలతో పాటు టీడీపీ కార్యకర్తలు ఆకర్షితులవుతున్నారు. ఇందుకు నిదర్శనంగా వంగర మండలం అరసాడ గ్రామానికి చెందిన 25 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి శుక్రవారం చేరాయి. ఈ మేరకు రాజాంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కంబాల జోగులుతో పాటు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగులు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఈ నాలుగేళ్లలో వైఎస్ఆర్‌సీపీ కుటుంబం చాలా పెద్దదైందని వెల్లడించారు. పెద్ద ఎత్తున ఇటీవల టీడీపీ నుంచి వైఎస్ఆర్‌సీపీలోకి ప్రజలు వస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలతో పాటు టీడీపీ కార్యకర్తలు కూడా తమ పార్టీలో చేరుతున్నారన్నారు. అరసాడ గ్రామానికి చెందిన ఆగూరు సత్యనారాయణ, ముని చిన్నంనాయుడు, హనుమంతు సుధ, బెవర సంగంనాయుడు, అచ్చుభుక్త వెంకటరావు, గణేష్, సూర్యనారాయణ, తుమ్మి లక్ష్మి, వివేక్, బెవర హేమంత్, రాయిపల్లి రవితేజ, లచ్చుభుక్త శ్రీనివాసరావు, ఎస్.భూషణరావు, ముని సీతమ్మ, ఆగూరు సత్యనారాయణ తదితర 25 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరగా, ఆ కుటుంబాలకు చెందిన వందమంది పార్టీలోకి వలసవచ్చారని వెల్లడించారు. కార్యక్రమంలో వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, పాలవలస ధవళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి నిర్వాసితుల సమస్యలు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



ఏటీ అగ్రహారంలో నిర్వాసితులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: తారక రామతీర్థ సాగర్ ప్రాజెక్టు ముంపు గ్రామ నిర్వాసితుల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని ఏటీ అగ్రహారం గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఆయనను గ్రామపెద్దలు మర్యాదపూర్వకంగా కలిసి పునరావాస సమస్యను వివరించారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు స్పందిస్తూ..ముంపు నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు జిల్లా అధికారులతో ఇప్పటికే చర్చించామని చెప్పారు. మే 3న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి భోగాపురం విమానశ్రయ శంకుస్థాపనకు రానున్నారని ఆయన దృష్టికి నిర్వాసితుల సమస్యలను తీసుకువెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దన్నానపేట–కుమిలి రహదారిలో స్థలాల కేటాయింపునకు ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాశినాయుడు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

యాసిడ్ తాగి వృద్ధురాలి మృతి



ఆస్పత్రిలో మృతిచెందిన కొండమ్మ

గంట్యాడ: పొరపాటున యాసిడ్ తాగిన ఓ వృద్ధురాలు మృతి చెందింది. మండలంలోని రామవరం గ్రామంలో జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పొటుపు రెడ్డి కొండమ్మ (60) శుక్రవారం ఉదయం టిఫిన్ చేసిన తర్వాత కిటికీ దగ్గర వాటర్ బాటిల్‌లో ఉన్న యాసిడ్‌ను తాగునీరు అనుకుని పొరపాటున తాగేసింది. దీంతో కుటుంబసభ్యులు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందింది. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.